సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్ కుమార్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

■ ఏసీపీ కిశోర్ కుమార్ ■ ధర్మారంలో కార్డన్‌సెర్చ్

పరకాల, జూలై 31 : గుడుంబా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఏసీపీ కిశోర్ కుమార్ అన్నారు. నడికూడ మండలం ధర్మారం గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 28 బైక్‌లు, మూడు ఆటోలకు రూ.13,100 జరిమానా విధించారు. రెండు బెల్ట్‌షాపుల నుంచి రూ.4,950 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, గ్రామాల్లో కొత్త వారు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పరకాల, పరకాల రూరల్, ఆత్మకూరు సీఐలు క్రాంతి కుమార్, రంజిత్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు

తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

■ లబ్ధిదారుల రిలే దీక్ష ■ పలు సంఘాల నాయకుల సంఘీభావం

హనుమకొండ, జూలై 31 : డబుల్ బెడ్ రూం ఇళ్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్ నగర్ లబ్ధిదారులు హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వీరికి పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎర్ర చంద్రమౌళి మాట్లాడుతూ.. జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. బాలసముద్రంలోని సర్వే నంబర్ 1066లో 50 సంవత్సరాల క్రితం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్ నగర్ పేర్లతో 600 నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. 2012లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాజీవ్ ఆవాస్ యోజన ద్వారా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో సర్వేచేసి ప్రజల జాబితా తయారు చేసిందన్నారు. ఆ సమయంలో తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ తెలంగాణ వస్తే పేదలకు డబుల్ బెడ్‌రూ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సర్వే చేసి లిస్టును ప్రకటించారని అన్నారు. ఈ క్రమంలో అప్పటి కలెక్టర్ అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్‌నగర్ గుడిసె వాసులను ఖాళీ చేయించి స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించగా, ఇళ్లు నిర్మించినప్పటికీ పంపిణీ చేయేలేదన్నారు. కానీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి 8 నెలలు కావస్తున్నా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి పాత జీవో ప్రకారం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీక్షలో కొయ్యడ కృష్ణ, ఓరుగంటి స్వామి, సారం రఘు, ఎర్ర రూప, బొచ్చు సరోజన, మోడె శిల్ప పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

ప్రసూతి దవాఖానలో పోషకాహారం పంపిణీ

హనుమకొండ, జూలై 31 : హనుమకొండ ప్రసూతి దవాఖానలో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో బుధవారం పోషకాహారాన్ని పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శారు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి కే ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన కమ్యూనిటీని ప్రోత్సహించడమే లక్ష్యంగా రోటరీ క్లబ్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వంగ రాజారెడ్డి, బేతి రవీందర్‌రెడ్డి, గంగోజుల నరేశ్, క్లబ్ మాజీ అధ్యక్షుడు రొండ్ల నరేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో అంబరీశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTek

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

CHANGE OF NAME

★ I, **VIJAYRAJ RP** S/o JASRAJ JI RP (New Name), previously called **RAJPUROHIT BAGRAJ** (Old Name), and residing at H.No. 12-1-137, Pinnavari Street, Warangal Dist., T.S, India, and solemnly declare.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

లోన్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త

శాయంపేట, జూలై 31 : లోన్ యాప్స్‌పై ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మారెపల్లి క్రాంతికుమార్ అన్నారు. శాయంపేటలోని మహిళా సమాఖ్య భవనంలో వీవోఏ, మహిళా సంఘాలకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ జీవిత బీమా ఉండాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల బీమా ఉంటుందన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతా, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పొద్దు అని అన్నారు. యువత మనీ యాప్స్ ద్వారా లోన్ తీసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, సీసీ కేదార్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ విజయ్ పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

నయీంనగర్, జూలై 31 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యూకేషన్(డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ)లో ప్రవేశాలకు తెలంగాణ డీఈఈసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు ఆగస్టు 1 నుంచి 6వ తేదీ వరకు హాజరుకావాలని విద్య, శిక్షణా సంస్థ ప్రధానాచార్యులు(ఎఫ్‌ఏసీ) వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ జిల్లా విద్య, శిక్షణ సంస్థలో టీజీ డీఈఈసెట్-2024 ర్యాంక్ కార్డు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

దవాఖాన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

■ కలెక్టర్ ప్రావీణ్య
■ మల్లక్కపేటలో ఇందిరా మహిళా శక్తి యూనిట్ల పరిశీలన

వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పరకాల, జూలై 31 : నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న వంద పడకల దవాఖాన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రూ.35కోట్లతో హాస్పిటల్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.17కోట్ల విలువైన పనులను పూర్తి చేశామని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులు అందించేందుకు ప్రజలు ఇప్పటికీ ఎంపీడీవో కార్యాలయానికి వస్తున్నారని, ప్రతి రోజు 10 నుంచి 15 దరఖాస్తులు వస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం మల్లక్క పేట గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు పొందిన మహిళలు ప్రారంభించిన యూనిట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

నడికూడలో..

నడికూడలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మండలంలోని తహసీల కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం వన మహోత్సవంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, మొక్కలతోనే వాతావరణ సమతుల్యతను కాపాడొచ్చన్నారు. అనంతరం మండలంలోని కంఠాత్మకూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు ఆయురారోగ్యాలతో ఉండాలి

హనుమకొండ, జూలై 31 : కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందినవారు శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని కలెక్టర్ ప్రావీణ్య ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో వెంకట మనోహర్‌రావు (సీనియర్ అసిస్టెంట్), మహ్మద్ యాకూబ్ బాషా(జమేదార్), ఆవులు బాలయ్య (కుక్) ఉద్యోగ విరమణ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్వో గణేశ్, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కాజీపేట, జూలై 31 : కడిపికొండ గ్రామ రెవెన్యూ శివారులోని 46వ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం విజ్ఞప్తి చేశారు. కాజీపేటలో ఆయన బుధవారం మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రభుత్వ భూమి అయిన మీడియా పాయింట్ ప్రతిపాదిత స్థలం, నిలువ నీడలేని పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలంపై కొంత మంది తప్పుడు కాగితాలతో అక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ ప్రభుత్వ స్థలం పై సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విలువైన స్థలాన్ని కాపాడాని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి వెనుకాడేది లేదన్నారు. ఈ భూమి కోసం గతంలో పోరాటం చేయడంతో తనపై కొంత మంది దాడి చేసి గాయపర్చిన విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

బల్దియాలో నలుగురు ఏఈలు బదిలీ

వరంగల్, జూలై 31 : బల్దియాలో పలువురు ఏఈలు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అరవింద (జీహెచ్‌ఎంసీ), రమ్యకృష్ణ (నర్సంపేట, మున్సిపాలిటీ), రోజారాణి, రాజేశ్వరి టీయూఎఫ్ఐడీసీ వరంగల్ యూనిట్‌కు బదిలీ అయ్యారు. అయితే నలుగురు ఏఈలు బదిలీ కాగా, కేవలం ఒక్కరు మాత్రమే బల్దియాకు వచ్చారు. గౌతమి పరకాల మున్సిపాలిటీ నుంచి టెక్నికల్ ఆఫీసర్‌గా బల్దియాకు బదిలీపై వచ్చారు. సిటీ ప్లానర్ వెంకన్న, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్లు, ఈఈ బీఎల్ శ్రీనివాసరావు, డీఈలు సంజయ్‌కుమార్, ఇస్రత్ జహన్ రిలీవ్ అయ్యారు. పారిశుధ్య కార్మికులు, అటెండర్లు, పంప్ ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లు 26 మంది పరకాల మున్సిపాలిటీకి రిలీవ్ అయ్యారు. అయితే ఒక్కరు కూడా బల్దియాకు బదిలీపై రాలేదు.

వాహనాల మరమ్మతులను జాప్యం చేయొద్దు

వరంగల్, జూలై 31 : పారిశుధ్య వాహనాల మరమ్మతులో జాప్యం చేస్తే సహించేది లేదని మేయర్ గుండు సుధారాణి హెచ్చరించారు. బుధవారం బాలసముద్రంలోని వెహికల్ షెడ్‌ను తనిఖీ చేశారు. వాహనాల మరమ్మతులు పెండింగ్‌లో ఉండకుండా షిఫ్టుల వారిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. ప్రతిరోజు డీఈలు పర్యవేక్షించాలన్నారు. మరమ్మతులు చేసిన తర్వాత బయటకు వచ్చే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తూ ఇంటి యాజమాని సంతకం తీసుకోవాలన్నారు. బల్దియా ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పరిశీలన

హసన్‌పర్తి, జూలై 31 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో విద్యాలత అధికారులను ఆదేశించారు. మండలంలోని సీతానాగారం అమ్మ ఆదర్శ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. గ్రామంలోని నర్సరీ, డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. అలాగే హసన్‌పర్తిలోని టీటీడీసీ ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్ స్థలాన్ని డీఆర్‌డీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన వెంట ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో విజయలక్ష్మి, ఏపీఎం ప్రభాకర్ ఉన్నారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

హనుమకొండ, జూలై 31 : జిల్లాలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. బుధవారం కలెక్టర్ ప్రావీణ్య పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ సురేశ్‌ను కమలాపూర్ తహసీల్దార్‌గా, ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన గౌరీశంకర్‌కు కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న నాయబ్ తహసీల్దార్ సంతోష్‌కుమార్‌ను ధర్మసాగర్‌కు, అక్కడ పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్ ప్రణయ్‌ను కాజీపేటకు, కాజీపేటలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలెక్టరేట్‌కు, సివిల్ సప్లయ్‌లో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్ క్రిష్ణను పరకాలకు, పరకాలలో పనిచేస్తున్న నాగేంద్ర ప్రసాద్‌ను సివిల్ సప్లయ్‌కు బదిలీ చేశారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ల విభాగంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న అనితను ధర్మసాగర్ అదనపు గిర్దావర్‌గా, ధర్మసాగర్ అదనపు గిర్దావర్ శ్రీనివాస్‌ను హనుమకొండ ఆర్డీవో ఆఫీసుకు, హసన్‌పర్తి అదనపు గిర్దావర్ కుమారస్వామిని ఆత్మకూరు మండల సీనియర్ అసిస్టెంట్‌గా, కొత్తగా జిల్లాలో రిపోర్టు చేసిన సీనియర్ అసిస్టెంట్ అనురాధను కలెక్టరేట్‌కు, రమేశ్‌ను శాయంపేట అదనపు గిర్దావర్‌గా, నడికూడ సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్‌ను హసన్పర్తి అదనపు గిర్దావర్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పేదలకు ఇంకెన్నాళ్లు నిరీక్షణ ?

■ ఇండ్ల స్థలాలపై ప్రకటన చేయాలి
■ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టీ శ్రీనివాసరావు

హనుమకొండ, జూలై 31 : పేదలు ఇండ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ధర్నా నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పేదలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాలు, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు దుర్భర జీవితం గడుపుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేద ప్రజలకు పక్కా ఇండ్ల నిర్మాణానికి నిధులను కేటాయించాన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎన్ అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలి'

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

గిర్మాజీపేట, జూలై 31: భద్రకాళీ బండ్ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా మార్చాలని భద్రకాళీ ట్యాంక్ బండ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్, సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు పలువురికి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి రవీందర్ అధ్యక్షతన బుధవారం బృందావనకాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్సును రక్షించేందుకు పాండు రంగారావు హైకోర్టులో వేసిన కేసు ఉన్నప్పటికీ, భద్రకాళీ సరస్సు పరిస్థితి ప్రత్యేకంగా ఉందన్నారు. 1971లో భద్రకాళీ చెరువు ఫోర్‌షోర్‌బండ్ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ జోన్‌గా నిర్ణయించిన మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించారని గుర్తుచేశారు. అప్పటినుంచి ఈ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా పునఃవిభజించడానికి అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమస్యపై లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ) సమావేశం నిర్వహించాలని మంత్రి సురేఖను కోరగా, వెంటనే స్పందించి కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల్లో అనిశ్చితి నెలకొందని, దీన్ని అధిగమించేందుకు గ్రేటర్ కమిషనర్ వెంటనే ఎల్‌పీసీ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. సమావేశంలో మల్లికార్జున్, సదానందం, సాయిలు, శ్రీనాథ్, జలేందర్, ప్రభాకర్, సంజీవాచారి తదితరులు పాల్గొన్నారు.

నాటకాలతో ప్రజల్లో చైతన్యం

గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ గ్రహీత శాంతి కృష్ణ ఆచార్య

నాటకం వేస్తున్న కళాకారులు

పోచమ్మమైదాన్, జూలై 31: నాటకాలు ప్రజల్లో చైతన్యం, మానసికోల్లాసం, ప్రశాంతతను కలిగిస్తున్నాయని గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ గ్రహీత శాంతి కృష్ణ ఆచార్య అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో సురభి నాటక సమాజం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వాముల జీవిత చరిత్ర నాటకాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటక రంగాలను ఆనాడు రాజులు, చక్రవర్తులు ప్రోత్సహించారని, అలాంటి వాటిని బతికించుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. నగరంలో ప్రభుత్వ స్థలం కేటాయించి, ఒక నాటక థియేటర్‌ను నిర్మించుకునేలా కృషి చేసి, తద్వారా భావితరాలకు శిక్షణ అందించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వాముల చరిత్రతో నాటకాలు ముగిశాయి. కార్యక్రమంలో నేరెళ్ల వేణుమాధవ్ సతీమణి శోభారాణి, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, పౌరాణిక నాటక సీనియర్ కళాకారులు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ చైర్మన్ కళాపిపాసి మారేడోజు సదానందాచారి, తెలంగాణ నాటక సమాజ సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, కేయూ పూర్వ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, వరంగల్ స్టార్ కళా పరిషత్ అధ్యక్షుడు దేవరాజు రవీందర్ రావు, భానోదయ నాటక మండలి అధ్యక్షుడు రేకందార్ నాగబాబు పాల్గొన్నారు.

డెయిరీ సభ్యులు మరింత ఆర్థిక ప్రగతి సాధించాలి

■ 22వ వార్షిక సభలో మహిళా డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీ
■ సభ్యులకు రూ.11.57 కోట్ల బోనస్ ప్రకటన

ముల్కనూరు పాల ఉత్పత్తుల లోగోను ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌రెడ్డి, డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీ

భీమదేవరపల్లి, జూలై 31 : ముల్కనూరు మహిళా సహకార డెయిరీ సభ్యులు మరింత ఆర్థిక ప్రగతి సాధించాలని అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ వెల్లడించారు. ముల్కనూరులోని మహిళా సహకార డెయిరీ ప్రధాన కార్యాలయంలో బుధవారం డెయిరీ 22వ వార్షిక మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హాజరయ్యారు. డెయిరీ జీఎం మారుపాటి భాస్కర్‌రెడ్డి వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం డెయిరీ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. వ్యాపారంలో వచ్చిన లాభాల్లో సభ్యులకు రూ.11.57కోట్ల బోనస్‌ను ప్రకటించారు. డెయిరీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సభ్యులకు రూ.107కోట్ల బోనస్ రూపేన పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గేదె పాలకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉందని, ఆవుపాలకు డిమాండ్ తక్కువగా ఉందన్నారు. డెయిరీకి ఆవు పాలు అధికంగా రావడంతో ధరను తగ్గించినట్లు చెప్పారు. సభ్యురాలు, ఆమె భర్త సహజంగా మరణిస్తే రూ. 25వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 50వేల బీమా వర్తిస్తుందని, ఈ భారాన్ని డెయిరీనే భరిస్తుందని తెలిపారు. పాలకేంద్రాల్లో సైతం కంప్యూటరీకరణ ద్వారా పాలను సేకరిస్తామని తెలిపారు. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులు ములుకనూరు డెయిరీలోనే లభిస్తాయని కొనుగోలుదారులు బాహాటంగా చెప్పడం అభినందనీయమన్నారు. సభ్యుల పరస్పర సహకారం వల్లే ములుకనూరు మహిళా డెయిరీ దినదినాభివృద్ధి చెందుతున్నదని, సభ్యులు డెయిరీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. అనంతరం ముల్కనూరు డెయిరీ పాల ఉత్పత్తుల నూతన లోగోను ఆవిష్కరించారు.

ఉత్తమ సంఘాలకు మెమెంటోల ప్రదానం..

పాల పరిమాణంలో వంగర, సహకార పద్ధతుల్లో భీమదేవరపల్లి, సంఘంతో సభ్యుల లావాదేవీల్లో కాశగూడెం(రాయగూడెం), పాడి పశువుల నిర్వహణలో ఉల్లంపల్లి, సంఘ ఆర్థిక లావాదేవీల్లో మల్లిపల్లిగూడెం సంఘాలు ఉత్తమ ప్రతిభ కనబర్చాయి. ఈ పాల సంఘాల అధ్యక్షులకు ధనశ్రీ, ప్రవీణ్‌రెడ్డి మెమెంటోలు అందజేశారు.

మూడు వార్డులకు ఎన్నికలు ఏకగ్రీవం..

ముల్కనూరు మహిళా సహకార డెయిరీలో 12 డైరెక్టర్ స్థానాలుండగా 3,4,9 వార్డులకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 3లో గుండెల్లి రజిత(రత్నగిరి-2), 4లో కొండం సుజాత(కందుగుల), 9లో గుగులోత్ సుజాత(వీర్లగడ్డ తండ) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అశుపతి వీరసోమమ్మ, జంపాల రాజేశ్వరి, నల్లాల సులోచన, పింగిళి రజిత, దొంతరబోయిన రజిత, మామిడాల శోభారాణి, కర్ర రమాదేవి, కత్తుల కవిత, పెద్దవేన రుణ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు మేనేజర్లు నాగరాజు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

'అధ్వానంగా ఎస్సీ కాలనీలు'

గూడెప్పాడ్‌లోని దళిత కాలనీ రోడ్డు

ఆత్మకూరు, జూలై 31 : మండలంలోని పలు గ్రామాల ఎస్సీ కాలనీల్లోని అంతర్గత రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారాయి. పంచాయతీ కార్యదర్శులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ధర్మసమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు మైదం రవి మహరాజ్ ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారని, కానీ రోడ్డు వేయలేదన్నారు. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, దళిత కాలనీలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదన్నారు. ఆత్మకూరులోని ఎస్సీ కాలనీల్లో మురుగు కాల్వలు లేకపోవడంతో రోడ్లపై బురద నీరు నిలిచి అధ్వానంగా తయారైందని, విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల ప్రత్యేకాధికారి ఎస్సీ కాలనీల్లోని సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.

నలుగురికి జరిమానా

శాయంపేట, జూలై 31 : నలుగురికి పరకాల ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శాలిని లింగం బుధవారం జరిమానా విధించారు. గత సంవత్సరం నంబర్ ప్లేట్లు లేకుండా బైక్‌లు నడిపిన శాయంపేటకు చెందిన సాదు నాగరాజు, తోడెటి లోకేశ్, ఓర్సు శ్రీనివాస్, మేరుగు అనిల్‌కు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు ఎస్సై ప్రమోద్ తెలిపారు.

సమీకృత మార్కెట్ పనుల్లో వేగం పెంచాలి

వరంగల్, జూలై 31 : సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. లక్ష్మీపురం మార్కెట్ ఆవరణలో నిర్మిస్తున్న మార్కెట్ పనుల ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్కెట్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న బస్‌స్టేషన్, తిలక్‌రోడ్డు, పోతన రోడ్డు ప్రాంతాల్లో చేపట్టిన శ్మశానవాటికల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈ శ్రీకాంత్, సతీశ్, హబీబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం..

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని కమిషనర్ అన్నారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో పారిశుధ్య కార్మికులు మైదం సరోజ, మేకల సాయిలు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, జియాలజిస్ట్ మాధవరెడ్డి, సూపరింటెండెంట్లు సంతోష్, ఆనంద్, దేవేందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్‌గా రవీందర్

హనుమకొండ, జూలై 31 : తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్‌గా 55వ డివిజన్ కోమటిపల్లికి చెందిన నమిండ్ల రవీందర్‌ను నియమించారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్లో సమావేశమై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య, అధికార ప్రతినిధి తూముల సదానందం, ఉపాధ్యక్షుడు ఎం చేరాలు ఉన్నారు.

ఒకరి అరెస్టు

పరకాల, జూలై 31 : యువతి ఆత్మహత్య కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన బొచ్చు పల్లవి జూలై 22న ఆత్మహత్యాయత్నం చేసుకోగా, చికిత్స పొందుతూ 28న మృతి చెందింది. మృతురాలి తండ్రి అశోక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పల్లవి మృతికి కారణమైన ఊరుగొండకు చెందిన జన్ను వినయ్ పోలీసులకు లొంగిపోయాడు. అతడిని కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు.

ట్రెజరీ డీడీగా ఏ శ్రీనివాస్ కుమార్

హనుమకొండ, జూలై 31 : జిల్లా ట్రెజరీ శాఖ డీడీగా ములుగు డీఆర్‌వో ఆకవరపు శ్రీనివాస్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీడీగా పనిచేసిన గుజ్జు రాజును డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ హైదరాబాద్‌కు బదిలీ చేశారు. కాగా, శ్రీనివాస్‌కుమార్ తన మదర్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయగా, హనుమకొండ డీడీగా నియమించారు. అలాగే ట్రెజరీ శాఖలో సీనియర్, జూనియర్ అకౌంటెంట్ల బదిలీలు జరిగాయి.

ఎంబీబీఎస్ విద్యార్థికి పుస్తకాల అందజేత

వరంగల్, జూలై 31 : రంగశాయిపేటకు చెందిన దుద్ది వెంకటేశ్వర్లు, శిరీష దంపతుల కుమార్తె గాయత్రి ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. పుస్తకాలు కొనుగోలుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మహేశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మధు, మహిళా విభాగం అధ్యక్షురాలు శైలజ రూ.25 వేల విలువైన బుక్స్‌ను బుధవారం అందజేశారు.ఫెడరేషన్ ప్రతినిధులు జీ సురేశ్, విజయ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, మనోహర్‌రెడ్డి, ఎర్ర నరేశ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గ్రీన్‌హౌస్ నిర్మాణాలపై అవగాహన

భీమదేవరపల్లి, జూలై 31 : గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో బుధవారం ఎస్ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు రైతులకు గ్రీన్‌హౌస్ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. గ్రీన్ హౌజ్ నిర్మాణాలు, వాటి రకాలు, అనువైన పంటలు వాటి ఉపయోగాలు, మరమ్మతుల గురించి అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు హేమ, ఆదిత్య, అభిచైతన్య, భార్గవి, లానాశ్రీ, శాలిక వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సుచిత్ కుమార్ సూచనల మేరకు ఈ అవగాహన కార్యక్రమం చేపట్టామని విద్యార్థులు వెల్లడించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కళాశాల డీన్ భూపాల్‌రాజ్, రైతులు మాధవరావు, రామారావు, చలపతి, శంకరయ్య, ప్రభాకర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఆత్మకూరు, జూలై 31 : మా సామాజిక సేవా సంస్థ (ఎన్‌జీవో) పెద్దాపురం పరిధిలోని మహాత్మా పూలే బాలికల పాఠశాలలో 500 నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి నాగబండి శివప్రసాద్ మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసిన నాగబండి శివప్రసాద్‌కు పాఠశాల ప్రిన్సిపాల్ అనిత ధన్యవాదాలు తెలిపారు.



బాలికలకు నోట్‌బుక్స్ అందిస్తున్న ప్రిన్సిపాల్ అనిత